క్లుప్తంగా

వైభవంగా శ్రీపుష్పయాగం



ప్రత్తిపాడులో విశ్వేశ్వరస్వామికి శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

ప్రత్తిపాడు: స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన క్షేత్రంలో శనివారం రాత్రి స్వామివారి శ్రీపుష్పయాగం అత్యంత వైభవోపేతంగా జరిగింది. గత నెల 25వ తేదీ రాత్రి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి విఘ్నేశ్వర పూజతో వేడుకను ప్రారంభించారు. శిష్టా కామేశ్వర శ్రీనివాస్, హరి ప్రియాంక దంపతుల ఆధ్వర్యంలో దంపతి తాంబూలం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తూగుటుయ్యాలలో స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించారు. పండితులు ఘనంగా పవళింపు సేవ నిర్వహించారు. భక్తులకు దర్పణ దర్శనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తేజోమూర్తుల వీరభద్ర ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు కేశవరపు నాగేశ్వరరావు, కొమ్ముల ఆనంద్, చిలకమర్తి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి, 6వ, 7వ, 8వ తరగతుల్లో ఖాళీల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ బి.రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 87126 25028 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చేపల మృత్యువాత

జగ్గంపేట: మండలంలోని రామవరం ముత్యాలమ్మ చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. గ్రామ శివారులో గల ఈ చెరువులో నీరు అడుగంటడంతో ఎండ తీవ్రతకు చేపలు చనిపోయాయి. గ్రామానికి చెందిన కొందరు ఫిషర్‌మెన్ సొసైటీగా ఏర్పడి ఈ చెరువులో చేపలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుమారు 40 ఎకరాల చెరువులో నీరు అడుగంటడంతో చేపలను పట్టి విక్రయించేస్తున్నారు. కాగా శనివారం రాత్రి పట్టిన చేపల్లో పెద్దవాటిని విక్రయానికి తరలించగా చెరువులో మిగిలిన చేపలు అధిక మొత్తంలో మృతి చెందాయన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం చెరువు వద్ద కొనుగోలు చేసిన చేపల నుంచి దుర్వాసన రావడంతో వాటిని వెనక్కి తీసుకు వచ్చారని, మృతి చెందిన చేపలను అక్కడే పూడ్చిపెట్టినట్టు తెలిపారు.

ఘనంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పాండవులపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పాండవుల పాలెంలో ఆదివారం కనకదుర్గమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీకి రూ.10 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో బవురువాక సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మాకా చంటిబాబు, లొండ బాబు, దేవ లక్ష్మణ్, విత్తనాల నాగేశ్వరరావు, సత్యనారాయణ, కర్రి నాగేశ్వరరావు, చామరి శ్రీను, సీతారామరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433

నిరుపయోగం.. అలంకారప్రాయం

- శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- విషసర్పాల సంచారంతో భయాందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

గోకవరం: మండలంలో విలువైన ప్రభుత్వ భవనాలు, స్థలాలు నిరుపయోగంగా మారాయి. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మార్కెట్ యార్డు భవనం, అచ్చియ్యపేటలోని సబ్‌ఇన్‌స్పెక్టర్ క్వార్టర్, పశువులాస్పత్రి సమీపంలోని జెడ్పీ అతిథి గృహం స్థలాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. రైతులు పండించిన పంటలు దాచుకునేందుకు వీలుగా విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సుమారు 2.5 ఎకరాల స్థలంలో 35 ఏళ్ల క్రితం మార్కెట్‌యార్డు భవనం నిర్మించారు. భవనం సమీపంలో రైతులు ధాన్యం, ఇతర పంటలు ఆరబెట్టుకోవడానికి ర్యాంపును సైతం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఈ భవనం రైతులకు సేవలందించినప్పటికీ గత కొంత కాలంగా వినియోగించకపోవడంతో భవనంతో పాటు స్థలం కూడా నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఈ స్థలంలో తుప్పలు ఏపుగా పెరిగిపోయి ఉండటంతో పలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. కొన్నేళ్ల క్రితం ఈ మార్కెట్ యార్డు స్థలంలో తుప్పలు మొత్తం తొలగించారు. రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఈ భవనాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. స్థలాన్ని అభివృద్ధి చేయడంతో పాటు భవనాన్ని రైతులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. ఇది ఆచరణలోకి రాకపోవడంతో ప్రతికూల వాతావరణ సమయంలో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం భవనం చుట్టూ, రెండున్నర ఎకరాల స్థలంలో తుప్పలు పెరిగిపోయాయి. ఈ ప్రదేశంలో ప్రమాదకరమైన విషసర్పాలు సంచరిస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. సమీపంలో బాలుర వసతి గృహం ఉండటంతో ఒక్కోసారి అవి వసతి గృహంలోకి వస్తున్నాయి. రాత్రి సమయంలో కోతులు గుంపులు, గుంపులుగా ఇక్కడే బసచేస్తూ సమీప ఇళ్లల్లోకి చొరబడి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.



మార్కెట్‌యార్డు సమీపంలోని కాలనీలో విషసర్పం

శిథిలావస్థలో ఎస్సై క్వార్టర్

గోకవరంలో పశువుల సంత మార్కెట్‌కు సమీపంలో ఉన్న ఎస్సై క్వార్టర్ శిథిలావస్థకు చేరింది. సుమారు 20 సంవత్సరాల క్రితం నుంచి ఈ భవనాన్ని వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఈ భవనం ఆవరణ రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలువురు రాత్రి సమయంలో ఈ క్వార్టర్ ప్రాంగణంలో మద్యం సేవించడంతో పాటు వ్యభిచారం వంటి పనులకు పాల్పడుతున్నారని, దీంతో స్థానికంగా నివసించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అలాగే జెడ్పీ అతిథి గృహం స్థలం నిరుపయోగంగా ఉంది. సుమారు 15 సంవత్సరాల క్రితం ఈ భవనం శిథిలావస్థకు చేరింది. నాటి నుంచి నిరుపయోగంగా ఉన్న ఈ భవనం స్థానంలో నూతనంగా భవనం నిర్మించేందుకు గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ అది కార్యరూపం దాల్చకపోవడంతో జెడ్పీ భవనం స్థలం నిరుపయోగంగా మారింది. వీటిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న భవనాలను పునరుద్ధరించాలని, ఖాళీ స్థలాలను చదును చేసి విద్యార్థులకు క్రీడా మైదానాలుగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.



గోకవరంలో శిథిలావస్థకు చేరిన మార్కెట్ యార్డు భవనం



తుప్పలతో నిండి ఉన్న మార్కెట్ యార్డు స్థలం



అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిన సబ్ ఇన్‌స్పెక్టర్ క్వార్టర్

విషసర్పాలు సంచరిస్తున్నాయి

మార్కెట్ యార్డు స్థలంలో తుప్పలు పెరిగిపోవడంతో విషసర్పాలు విపరీతంగా సంచరిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా విషసర్పాలు ఇంటి ఆవరణల్లో తిరుగుతుండటంతో తీవ్ర భయాందోళన చెందుతున్నాం. అధికారులు స్పందించి మార్కెట్‌యార్డు స్థలాన్ని శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావాలి.
– డి.చంద్రశేఖర్, స్థానికుడు, గోకవరం

క్రీడా స్థలంగా తీర్చిదిద్దాలి

మార్కెట్‌యార్డు స్థలం గత 20 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఖాళీ స్థలం మొత్తం తుప్పలతో నిండిపోయింది. తుప్పలను తొలగించి చదును చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే విద్యార్థులకు క్రీడా మైదానంగా ఉపయోగపడుతుంది.
– టి.రాంప్రసాద్, స్థానికుడు, గోకవరం

ఉపయోగం లేని బడ్జెట్‌తో మోసం



విలేకర్లతో మాట్లాడుతున్న సూర్యచంద్ర

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం ఉపయోగంలేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రజలను మోసం చేసిందని జగ్గంపేటకు చెందిన సామాజిక వేత్త, స్వతంత్ర అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. బూరుగుపూడిలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్‌తో పాటు మరో 150 పథకాలు అమలు చేస్తామని కూటమి నేతలు ప్రచారం చేశారన్నారు. కాగా బడ్జెట్‌లో పథకాలకు నిధులు కేటాయించకుండా ప్రజలకు మొండిచేయి చూపించారన్నారు. ఏలేరు ఆధునీకరణ, మల్లవరం పుష్కర ఎత్తిపోతల పథకం, తాళ్లూరు లిఫ్ట్ పునఃనిర్మాణం, శృంగరాయుని పాలెం-కృష్ణవరం ఏలేరు కాలువపై బ్రిడ్జి నిర్మాణం, గోకవరంలో డిగ్రీ కాలేజ్, ఫైర్ స్టేషన్ నిర్మాణాలు, కిర్లంపూడిలో డిగ్రీ, గండేపల్లిలో జూనియర్ కాలేజీల నిర్మాణం చేపడతామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ ప్రజలకు వాగ్దానం చేశారని గుర్తుచేశారు. తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పైపులు గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనే 88 సార్లు పగిలిపోయాయన్నారు. 2016లో అప్పటి అధికారులు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా నిధులు కేటాయించలేదన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ స్పందించి పుష్కర ఎత్తిపోతల పథకం పునఃనిర్మాణం పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలన్నారు. లేని పక్షంలో రైతుల తరపున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



కోటనందూరు హైస్కూల్లో కలసిన పూర్వ విద్యార్థులు



కిర్లంపూడిలో 42 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

- ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు
- ఆటపాటలతో సందడి

కోటనందూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 18 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సమేతంగా వచ్చి సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని పరిచయం చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరివేసుకుంటూ సంతోషంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థులు తోలెం విజయ్‌రాజు, కోటిపల్లి శివసూర్యమూర్తి, జి.నాగరత్నం, శ్రీనివాసు, రాజేశ్వరి, గోపీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కిర్లంపూడి: అరే బాగున్నావా... ఎంత మారిపోయావు రా.. ఎంత కాలమైంది నిన్ను చూసి..అంటూ కుశల ప్రశ్నల మధ్య పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సాగింది. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 1978-83 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలోనే కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు గణేశుల రాంబాబు, లక్ష్మణరావు సోదరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదువు అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సుమారు 42 ఏళ్ల తరువాత కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు పరిచయం చేసుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అకాల మరణం పొందిన తోటిమిత్రుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అనంతరం తాము చదువుకున్న తరగతి గదుల్లోకి వెళ్లి అలనాటి చిలిపి చేష్టలు గుర్తు చేసుకుని మురిసిపోయారు. మిత్రులంతా కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. మిత్రులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్వవిద్యార్థి దిడ్డి గణపతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భౌతిక్క దాడులు !



ఏలేశ్వరంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ఏలేశ్వరం: నగర పంచాయతీలో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. దీంతో పగలు సైతం పట్టణంలో ఒంటరిగా వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. కాగా రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఏలేశ్వరం నగర పంచాయతీలో సుమారు 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. కాగా పట్టణంలో సుమారు వెయ్యికు పైగా కుక్కలు ఉన్నాయని అంచనా. ఇవి రాత్రిపూట రోడ్లపై తిష్టవేయడంతో వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాదచారులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నాయి. మున్సిపల్ సిబ్బంది కుక్కల నివారణకు తాత్కాలిక చర్యలు తీసుకుని చేతులు దులుపుకొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుక్కల దాడిలో గాయపడిన వారికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రేబిస్‌వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. శంఖవరం మండలం శృంగధార అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై దాడి చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నులపండువగా మహా యాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

పిఠాపురం: పట్టణంలో ఆదివారం సావిత్రు కాఠక్ మహా యాగం కనుల పండువగా నిర్వహించారు. ఈ యాగానికి సంబంధించి పూర్ణాహుతి వైభవంగా నిర్వహించగా, వందలాది మంది భక్తులు తిలకించారు. పూజల్లో భాగంగా ఉదయం గోపూజ, రుద్రాభిషేకం, నమకం, చమకం, హోమం పరిసమాప్తి, పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు భక్తులకు వేద ఆశీర్వచనం అందజేశారు. మైథిలి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మీనాక్షి గిరిధారి, అనంత్ పూజారితో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ సంస్థాగత ఎన్నికల కో-రిటర్నింగ్ అధికారి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, వేద పండితులు ఉప్పులూరి సత్యనారాయణ అవధానులు, ద్విభాష్యం రాంబాబు, సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

వాణిజ్య విభాగం అధ్యక్షుడికి అభినందనలు



వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కృష్ణాజీని సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కోటనందూరు: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నియమితుడైన వెలగా వెంకటకృష్ణాజీని ఆ పార్టీ శ్రేణులు అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం వెంకటకృష్ణాజీని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణాజీ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో అందరి సహకారంతో వాణిజ్య విభాగాన్ని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి వచ్చే పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, నారాయణరాజు, చిటికెల వెంకటరమణ, ఉల్లూరి శ్రీను, మళ్ల రవి, కురందాసు రాంబాబు, మళ్ల సూర్యచంద్ర, చింతల రమణ, పాలిక శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరానికి శంకుస్థాపన



యర్రవరంలో నిర్మాణ పనుల వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో షిర్డీ సాయిబాబా మందిర నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామంలోని ఏలేరు నది ఒడ్డున నిర్మిస్తున్న మందిరానికి పులివాసు, ఇందిరాజ్యోతి దంపతులు భూమిపూజ చేశారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంబెడెడ్ టెక్నాలజీతో ఉజ్వల భవిత



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

గండేపల్లి: ఎంబెడెడ్ టెక్నాలజీతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆదిత్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. సూరంపాలెం ఆదిత్య కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం మరింత డిజిటల్‌గా కనెక్ట్ చేయబడి ఆటోమేటెడ్‌గా మారుతోందన్నారు. ఎంబెడెడ్ టెక్నాలజీ ద్వారానే ఇది సాధ్యమన్నారు. రీసోర్స్ పర్సన్‌గా ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ సీహెచ్ సంతోష్ పాల్గొని ఎంబెడెడ్ సిస్టమ్స్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ డీన్ వైకేఎస్ సుబ్బారావు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎం.రవీంద్ర, వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ ఎం.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరం శివాలయం వద్ద నేడు అన్నదానం

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం) వద్ద సోమవారం భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. శివరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని భక్తుల సహకారంతో ఈ అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

